# ప్రియురాలు! - భార్య!

"ఏయ్!! లలనా! ఏమిటి పెళ్లయ్యాక పత్తాలేకుండా పోయావ్? శ్రీవారు తప్ప ఇంకెవ్వరి ధ్యాసలేదా ఏమిటి? ఎంత ప్రేమించి పెళ్లిచేసుకున్నా ఇన్ని రోజులా? ఎవ్వరినీ కలుసుకోకుండా! ఎక్కడికీ పోకుండా, ఏమిటీ అంత ఇది?"... సమాధానం చెప్పడానికి కూడా అవకాశమివ్వకుండా గడగడా మాట్లాడేసింది మానస.

"ఏంటోనే..బోర్!" అంది నవ్వుతూ లలన. "ఏంటిబోర్? పెళ్లా? జీవితమా? మొగుడా?" అంది మానస సాగదీస్తూ.

"అన్నీను" నవ్వుతూనే సమాధానం చెప్పింది లలన.

"అదేమిటే? పెళ్లయి ఆర్నెల్లుకాలేదు. ఇదేం వైరాగ్యం? అప్పుడే బోర్.. బోర్.. అన్న పదం ఇన్నిసార్లు వాడావు అందులోనూ మీది మామూలుగా అరేంజ్‌డ్ మేరేజ్ కాదు లవ్‌మారేజ్ కూడానూ! ఒకరి కొకరు దాదాపు నాలుగేళ్ల నుంచీ పరిచయం. అటువంటప్పుడు సమస్యేముంది?" అంది లలన. కారణాలూ, వివరాలు అన్నీ చెబితేగానీ ఒదిలిపెట్టకూడదన్నట్టుగా, ప్రశ్నలమీద ప్రశ్నలు కురిపిస్తూ.

మొత్తానికి మానస వేసే ప్రశ్నల వలయంలో నుంచి తప్పుకోలేకపోయింది లలన. ఏం చెప్పాలో తెలీక, 'ఏమీలేదే' అంది.

ఇంక అలా అడుగుతే లాభంలేదని ప్రశ్నావళిలా, అడగడం మొదలెట్టింది.

"నీ ఉద్యోగం ఎలావుంది?" అడిగింది మానస.

"బాగానే వుంది!"

'ఏమిటా సమాధానం? ఎప్పుడూ ఉద్యోగం గురించి కదిపితే చాలు, 'ఇంకచాలు ఆపు బాబోయ్' అనేదాక బోర్ కొట్టించేస్తావ్ ఏవో కబుర్లతో

అట్లాంటిది అంత ముక్తసరిగా, 'బాగానే వుంది' అంటే ఆశ్చర్యంగా వుంది అంది మానస. మానసా, లలనా చాలా 'థిక్ ఫ్రెండ్స్' వాళ్లిద్దరూ కె.జి నుంచి పి.జి వరకు కిండర్ గార్టెన్ తరగతులనుంచి, పోస్టు గ్రాడ్యుయేట్ డిగ్రీవరకూ మంచి స్నేహితులు. ప్రతి విషయం మనసువిప్పి మాట్లాడుకుంటారు గంటల గంటల సేపు.

'సరేష్‌కి నేను ఉద్యోగం చెయ్యడం ఇష్టంలేదు అంది లలన!'

"అదేమిటి? మరి ఆ సంగతి పెళ్లికి ముందు ఎప్పుడూ చెప్పలేదా?'

"లేదు"

"అయినా ఏదో చిన్న ఉద్యోగం కాదుకదా! ఆఫీసర్ హోదా! అయిదు వేలకుపైగా జీతం.

"పిల్లలు పుడితే ఉద్యోగంవల్ల పిల్లలకి కష్టమవుతుందట!"

"ఏడిసినట్టుంది. అయితే మళ్లీ వెనకటికాలం లాగా, ఆడవాళ్లు వంట చేసుకుంటూ, పిల్లల్ని కంటూ ఇంట్లో పడుండాలన్నమాట! "నువ్వు వీల్లేదూ అనకపోయావా?"

"అన్నాను"

"మరి?"

"అంతే!"

"ఈమాట పెళ్లికి ముందు ఎందుకు చెప్పలేదూ" అని అడక్కపోయావా?"

"ఊ.. అప్పుడు ఒక ప్రియుడుగా నన్ను కలుసుకోడానికి ఒచ్చేవాడు. ఇప్పుడు మరి 'భర్త' హోదాలో వున్నాడు కదా?" నవ్వింది లలన.

"ప్రియుడుగా వున్నప్పుడు, ఎక్కడ నొప్పిస్తే ఆమె నొచ్చుకుని తనకి దూరమయిపోతుందోననే భయంతో మగాడు, ప్రియురాలు చెప్పినట్టు వింటాడు.

ఆమెను ఆకర్షించి ఆకట్టుకున్నాక అతనికి తెలుసు ఆమె 'దాసోహం' అంటుందని.

పెళ్లికాగానే ఇంక అతనికి విపరీతమయిన ధైర్యం వొచ్చేస్తుంది. "ఇది నాభార్య! నన్ను కాదని ఎక్కడికీ పోలేదు, చివరికి పుట్టింటికి కూడా" అందుకే అతను తన ఆంక్షలన్నీ పెళ్లి తరువాత పెడతాడు, భర్త హోదా వొచ్చాక. "నువ్వు చెప్పింది కరెక్టే! మొన్న సుభాషిణి కనిపించింది. ఆఫ్టరాల్ సుభాషిణి మొగుడు రాజీవ్ తనకి బావవుతాడు కదా! 'బావా!' వొచ్చాడూ' అని మాట్లాడడం అలవాటు కదా! పెళ్లినాటి రాత్రే చెప్పాట్ట. తనని బావా! అని పిలవొద్దూ' అని మరి అత్తయ్యా నీ స్నేహితులూ పిలిచినట్టు రాజా! అని పిలవమంటావా?' అని అడిగితే విరుచుకుపడ్డాట్ట. అతణ్ణి 'ఏమండీ!' అనే పిలవాలట. వాళ్లమ్మని 'అత్తయ్యా! అనకుండా అత్తగారూ అని పిలవాలట. సుభాషిణికి ఈ కొత్త సంబోధన అలవాటుకాక అసలు పిలవటమే మానేసింది. అంతెందుకు?

"అదేనే! పెళ్ళికానప్పుడు ఇలాంటి కండిషన్లు పెడితే ఎక్కడ వాళ్ల చెయ్యి జారిపోతారోనన్న భయంతో మహా ఇదిగా ప్రవర్తించి, మనసులు దోచుకుని పెళ్లిదాకా వొచ్చేదాకా మాట్లాడరు. ప్రియుడిగా 'ప్లీజ్' చెయ్యడం కోసమే తాపత్రయపడే వారు, భర్తకాగానే ఆజ్ఞాపించడం మొదలెడతారు. ఎంత అవివేకులు అనాలో, అహంభావికలు అనాలో అర్థంకావడంలేదు మగాళ్లని!" అంది లలిన.

"అహంభావికలే! ఈ పురుషాధిక్యతగల ప్రపంచంలో మగాడు తను పెత్తనం చెలాయించాలీ అనే అనుకుంటున్నాడుగానీ, పెత్తనం చేసి, ఆమె అభీష్టాలనీ, అభిరుచులనీ, వ్యక్తిత్వాన్ని కాదని బాధపెడుతున్నానని అనుకోడు! అదే విచిత్రం! ప్రియురాలిగా ఆమెనుంచి ఏవైతే కోరుకుని ఆనందిస్తాడో భార్యకాగానే వాటిని నిషేధిస్తాడు. ఈ పురుషులు మారేదెల్లాగ?" అంది బాధగా మానస. "భారతదేశంలో కాన్స్టిట్యూషన్ మార్చడం ఎంత కష్టమో, పురుషాధిపత్యాన్ని మార్చడంకూడా అంతే కష్టం! ఆ విషయం మర్చిపో! వేరే కబుర్లు చెప్పు" అంది లలిన విషయం మారుస్తూ. ★